


ఈకాలం వార్త
THE HONEST TELUGU DAILY




శుక్రవారం 27-03-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :148 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

# అన్ని రాష్ట్రాల సీఎంలతో రేపు మోదీ సమావేశం

**పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది.**



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ (రావీ వీశీసఱ) మార్చి 27న వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. పేజి 2లో ▶

# ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం



అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. పేజి 2లో ▶

# విద్య, పేదల వైద్యం

## మాకు అత్యంత ప్రాధాన్యాంశాలు: సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రభుత్వ ఆస్పత్రులకు:**

## 927 కోట్లు

**ప్రైవేటు ఆస్పత్రులకు:**

## 1,480 కోట్లు



హైదరాబాద్: విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. శాసనసభలో సీఎం మాట్లాడారు.

గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలను పెండింగ్‌లో ఉంచిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటివరకు తమ ప్రభుత్వం రూ.2,408 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించినట్లు సీఎం వివరించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు.

టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. పేజి 2లో ▶

# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గద్దర్ భార్య విమల

**పరామర్శించిన భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్**



దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల నిమ్స్ లో గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం నిమ్స్ లో చేరిన విమల గారికి నేడు సర్జరీ జరగనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ లు కొద్దిసేపటి క్రితం నిమ్స్ లో డైరెక్టర్ బీరప్పను కలిసి విమల కు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. విమల వెంట కుమారుడు సూర్యం కుటుంబ సభ్యులు ఉన్నారు.

# బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి



2లో..

# కవిత కొత్త పార్టీ

## తెలంగాణ ప్రజా జాగృతి

**నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన**
**రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం**



2లో..

# ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

## సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు


**ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం**
**ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్**
**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.



2లో..

# తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. స్పీకర్ ట్రైబ్యునల్‌కు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కూ నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన ఇద్దరిపై స్పీకర్ ట్రైబ్యునల్ చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వాదించారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని వాదించారు. కడియం, సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 16కి వాయిదా వేసింది.

# సంపాదకీయం

## ఉన్నత విద్యకు 'కొత్త' గ్రహణం

ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) స్థానంలో ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పూనుకున్నది. ఆ సంకల్పంతోనే 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' (వీబీఎస్ఏ) బిల్లును ప్రతిపాదించింది. యూజీసీ మాజీ సభ్యుడుగా ఆ ఉన్నత విద్యా సంస్థ రద్దుకు నేను ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చను. ఎందుకని? యూజీసీ ఒక విఫల వ్యవస్థ. విద్యావేత్తలేకాదు, విధాన రూపకర్తలు సైతం ఈ విషయమై ఏకాభిప్రాయంతో ఉన్నారు. అయితే జాతీయ నూతన విద్యా విధానం (ఎన్‌పీఏ)--2020 వాగ్దానం చేసినట్టుగా యూజీసీ స్థానంలో ఒక నూతన నియంత్రణ వ్యవస్థగా వీబీఎస్ఏ ఆవిర్భవిస్తే దానికి నేను సంతోషంగా మద్దతునిస్తాను. ఎన్‌పీఏ వాగ్దానం చేసిన సంస్థ ఎలా ఉంటుందో కూడా ఒకసారి గుర్తుచేస్తాను: 'వ్యవస్థలో నిరోధ సమతౌల్యాలను వ్యవస్థీకరించి, ప్రయోజనాల సంఘర్షణను సాధ్యమైనంతగా తక్కువ స్థాయిలో ఉంచుతూ అధికారాల కేంద్రీకరణను రూపుమాపే స్వతంత్ర, సాధికార సంస్థ ఒకటి ఉన్నతవిద్యా వ్యవస్థకు అత్యవసరం'.విచారకరమైన విషయమేమిటంటే ప్రస్తుతం పార్లమెంటు స్థాయీ సంఘం పరిశీలనలో ఉన్న ప్రతిపాదిత వీబీఎస్ఏ బిల్లు ఎన్‌పీఏ దార్శనికతకు విరుద్ధంగా ఉన్నది. కొత్త నియంత్రణ నిర్మాణం అధికారాల కేంద్రీకరణకు దోహదం చేసేదిగా ఉన్నది. ఇది ఉన్నత విద్య కేంద్రీకరణ, అధికార యంత్రాంగం పెరుగుదల, ఉన్నత విద్య వాణిజ్యీకరణకు దారి తీసేదిగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రస్తుత యూజీసీ వ్యవస్థకంటే రాబోయే వీబీఎస్ఏ వ్యవస్థ మరింత అధమమైనది. ఉన్నత విద్య సమున్నత లక్ష్యాల పరిపూర్తికి అది దోహదం చేయగలదని భావించడం ఒక భ్రమ మాత్రమే. 2010--13 సంవత్సరాల మధ్య యూజీసీ గౌరవ సభ్యుడిగా ఉన్న కాలంలో దేశ ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణ ఎలా ఉంటుందో, అవి ఎలా నిర్దేశితమవుతాయో చాలా దగ్గరగా పరిశీలించే అవకాశం నాకు లభించింది. యూజీసీ ఒక అవినీతికర, అసమర్థ సంస్థ. ప్రయోజనాల సంఘర్షణ కూడా యూజీసీలో ముమ్మరంగా ఉన్నది. యూజీసీకి బాధ్యత వహించే విద్యావేత్తలు కేంద్ర ప్రభుత్వంలోని ఒక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ నుంచి ఫోన్ వస్తే చాలు, ఎంతో విధేయంగా లేచి నిలబడి మరీ మాట్లాడడం పరిపాటి. ఇది నమ్మవలసిన నిజం. యూజీసీ స్వయం ప్రతిపత్తి అనేది కాగితాలకే పరిమితమైన విషయం.

యూజీసీలో మొట్టమొదటి అధికారిక ప్రయోజనాల సంఘర్షణకు మార్గదర్శకాలను ఆమోదింపజేయడం ఆ సంస్థ గౌరవ సభ్యుడిగా నేను సాధించిన ఏకైక విజయం. వాటి ప్రకారం, యూజీసీ కమిటీల సభ్యులు తమకు ఏవైనా సంభావ్య ప్రయోజన వైరుధ్యాలు ఉంటే వాటిని ప్రకటించాలి. తమకు భాగస్వామ్యం లేదా ప్రమేయమున్న సంస్థలకు సంబంధించిన నిర్ణయాల నుంచి వైదొలగాలి. అయితే నేను ప్రవేశపెట్టిన ఈ విధానమే నన్ను యూజీసీ నుంచి తొలగించేందుకు దారితీసింది! రాజకీయ క్రియాశీలత అన్న ఆరోపణపై నన్ను తొలగించారు. చెప్పవచ్చినదేమిటంటే యూజీసీ వ్యవస్థ ఉన్నతస్థాయి నుంచి సకల అధర్మాచరణలతో భ్రష్టుపట్టిపోయింది. దాన్ని పై నుంచి కింది దాకా సర్వసమగ్రంగా సంస్కరించవలసిన అవసరమున్నది.

ఇది నా ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు. 2009లో ప్రొఫెసర్ యశ్‌పాల్ నేతృత్వంలోని ఒక కమిటీ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. 'భారతదేశంలో ఉన్నత విద్య పునరుద్ధరణ, పునరుజ్జీవనం' పేరిట ఉన్న ఆ నివేదికను ప్రస్తుత సందర్భంలో చదవడం సత్ఫలితాల నివ్వగలదు. ఉన్నత విద్య ఒక వ్యాపార సరుకుకాదని, అది ఒక ప్రజా ప్రయోజనమని ఆ నివేదిక పేర్కొంది. విశ్వవిద్యాలయం ప్రాథమిక ఉద్దేశం జ్ఞాన సృష్టి, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడమని స్పష్టం చేసింది. ఉన్నత విద్యారంగం లాభాపేక్షతో నడిస్తే ఆ సమున్నత లక్ష్యాలను సాధించలేమని యశ్‌పాల్ కమిటీ అభిప్రాయపడింది. ఉన్నత విద్యారంగంలో ప్రమాణాలు నాణ్యమైనవిగా ఉండాలంటే ప్రభుత్వం నిధులు ఉదారంగా అందించాలని, విద్యా వ్యాపారీకరణ, విద్యా ప్రమాణాల పతనాన్ని అరికట్టేందుకు కఠినమైన నియంత్రణ ఉండాలని నివేదిక సిఫారసు చేసింది.

ప్రస్తుత వీబీఎస్ఏ బిల్లు ప్రతిపాదనలు యశ్‌పాల్ కమిటీ సిఫారసులకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ బిల్లు చట్టంగా అమలులోకి వస్తే మూడు ప్రతికూల పరిణామాలు ఏకకాలంలో సంభవిస్తాయి: ఉన్నత విద్యా సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతాయి; బోధనా సిబ్బందికి విద్యా సంబంధ స్వేచ్ఛ కొరవడుతుంది; ఉన్నత విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం తగ్గిపోతుంది. ఇవి ఉన్నత విద్య ప్రజా ప్రయోజనాలను నెరవేరుస్తాయా? సామాజిక న్యాయానికి దోహదం చేస్తాయా? సమాధానాలు స్పష్టమే.

ఉన్నత విద్యా వ్యవస్థకు సంబంధించి కొత్త శాసన నిర్మాణంగా ఉద్దేశించినప్పటికీ వీబీఎస్ఏ బిల్లు నిజానికి 2018లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్ఈసీఐ) కొత్త అవతారమే, సందేహం లేదు. హెచ్ఈసీఐ బిల్లు శాసనంగా రూపుదాల్చినప్పుడు అధికారాలు కేంద్రీకృతమై ఉన్నత విద్యావ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, నిధుల లభ్యతను కోల్పోతుందని విద్యావేత్తలు, విద్యార్థిలోకం, రాజకీయ పక్షాల నుంచి తీవ్ర భయాందోళనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆ బిల్లును ఉపసంహరించుకోక తప్పలేదు. అధికారాల కేంద్రీకరణ సమస్య గురించి నేటి కొత్త బిల్లు పట్టించుకోలేదు. పైగా అదే లక్ష్యాన్ని -- అధికారాల కేంద్రీకరణ-- సాధించేందుకు మరింత సంక్లిష్ట సంస్థలను సృష్టించింది. సర్వాధికార హెచ్ఈసీఐకు బదులుగా మూడు వేర్వేరు సంస్థల -- రెగ్యులేటరీ కౌన్సిల్, అక్రిడిటేషన్ కౌన్సిల్, అకడమిక్ స్టాండర్స్ కౌన్సిల్-- ను పర్యవేక్షించే వీబీఎస్ఏ అనే సర్వోన్నత సంస్థ ఉనికిలోకి రానున్నది. అయితే అధికారాల కేంద్రీకరణ అనే మౌలిక లక్ష్యంలో ఎటువంటి పట్టు విడుపులు లేవు. ఆ మాటకొస్తే ఇది గతంలో కంటే మరింత దృఢతరమైనది. నాలుగు కీలక విషయాలలో ఈ మార్పును స్పష్టంగా చూడవచ్చు.

మొదటిది: ఈ కొత్త సంస్థల --జాతీయ విద్యా నియంత్రణ మండలి, జాతీయ అక్రిడిటేషన్ కౌన్సిల్, ఉన్నత విద్యా నిధుల మండలి, సాధారణ విద్యా మండలి-- వ్యవస్థకు ఎటువంటి స్వతంత్ర ప్రతిపత్తి లేదు. ఇవి వేర్వేరు విభాగాలే కానీ స్వతంత్రమైనవి కావు. వీబీఎస్ఏ, అది పర్యవేక్షించే మూడు సంస్థలు నిర్మాణ పరంగా ఒకే విధమైనవి. సంస్థ చైర్మన్‌ను, సభ్యులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహించేవారిని కూడా కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. తన ఇష్టానుసారం చైర్మన్, సభ్యులను తొలగించే అధికారం, మొత్తం కమిషన్‌ను కొనసాగించడం లేదా రద్దు చేసే అధికారం కేంద్రానికి ఉన్నది. తమ రాజకీయ యజమానుల తరఫున కొంతమంది ఐఏఎస్ అధికారులు వీబీఎస్ఏ వ్యవహారాలను నియంత్రిస్తారు.రెండోది: ఉన్నత విద్యావ్యవస్థ నియంత్రణ 'సులభంగా, పటిష్ఠంగా' ఉంటుందని నూతన విద్యా విధానం--2020 ఇచ్చిన హామీకి విరుద్ధంగా వీబీసీఏకు బలవంతంగా జోక్యం చేసుకునే అధికారాలను కల్పించారు. గతంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు గానీ, మరే ఇతర ఉన్నత విద్యా నియంత్రణ సంస్థకు గానీ ఇటువంటి అధికారాలు లేవు. తన పర్యవేక్షణలోని మూడు సంస్థల సిఫారసుల మేరకు ఉన్నత విద్యా సంస్థలు, వాటి నిర్వాహకులను శిక్షించేందుకు, ఒక డిగ్రీకి గుర్తింపును రద్దు చేసేందుకు, ఒక కళాశాల లేదా ఒక విశ్వవిద్యాలయాన్ని మూసివేయాలని ఆదేశించేందుకు వీబీసీఏకు సంపూర్ణ అధికారాలు ఉన్నాయి.

మూడోది: సమాఖ్య నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమనేది వీబీఎస్ఏ బిల్లులోని ఒక ప్రధాన ప్రతికూల అంశం. బహుశా అది దాని అత్యంత చెడ్డ లక్షణమని చెప్పవచ్చు. ఇప్పటికీ అత్యధిక విద్యార్థులు ఉండే ఉన్నత విద్యా సంస్థలకు నిధులు మంజూరు చేస్తూ వాటి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలకు వీబీఎస్ఏను నడపడంలో ఎటువంటి ప్రమేయం ఉండదు. 15 మంది సభ్యులలో ఒక స్థానానికి ఏటా ఒకరిని ఎంపిక చేయడం మినహా మరెలాంటి ప్రవేయానికి ఆస్కారం లేదు. ఇది కూడా వీబీఎస్ఏ ఆధ్వర్యంలోని మూడు సంస్థలకూ వర్తించదు. 2018 బిల్లు ఒక బలహీన సంప్రదింపుల వేదికను సమకూర్చింది. కేంద్ర విద్యామంత్రితో పాటు రాష్ట్ర ఉన్నత విద్యా మండళ్ల

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

నిజామాబాద్,: తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్–డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్దాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

## విద్య, పేదల వైద్యం మాకు అత్యంత ప్రాధాన్యాంశాలు: సీఎం రేవంత్‌రెడ్డి

విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.

## బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

దిల్లీ: ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సు ప్రమాదంలో పలువురు సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని మోదీ అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.

### సిఎంతో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ

తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం కలిసింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణ లోనూ 'ప్రజా సూచన పోర్టల్ ' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోటఈ పోర్టల్ లో అందుబాటులో ఉంచుతారు. ఐటీ శాఖ ద్వారా ఈ పోర్టల్ ను అభివృద్ధి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్ ను నిఖిల్ డే ప్రశంసించారు. ఈ బిల్ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు దాన కిషోర్, వి. శేషాద్రి, బి. అజిత్ రెడ్డి,

## ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం !

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతు న్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతలు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా–ఇజ్రాయెల్ లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎ÷–లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హోర్ముజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

## మార్కాపురం మృతులకు కేబినేట్ సంతాపం

:ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఏపీ కేబినెట్ భేటీలో చర్చించారు. మృతుల కుటుంబాలకు మంత్రివర్గం ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా బస్సు ప్రమాద బాధితులకు ఏపీ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మార్కాపురం మండలం రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 14 మంది సజీవ దహనం అయ్యారు. ప్రైవేటు బస్సు, టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 14 మంది చనిపోగా.. 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## అన్ని రాష్ట్రాల సీఎంలతో రేపు మోదీ సమావేశం

మొదటి పేజీ తరువాయి

**ఆ సీఎంలు దూరంగా..**

వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు (ఌం౦వఎశ్రీఎ జుశ్రీవమ్మ్‌ఱశీఅం) జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని–సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం.ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## బస్సు కండిషన్‌పై ముందే హెచ్చరించిన ప్రయాణికులు

ప్రమాదం నేపథ్యంలో కీలక విషయం వెల్లడైంది. బస్సు కండీషన్‌పై అందులోని ప్రయాణికులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేశారు. కండీషన్ సరిగా లేదని డ్రైవర్‌తో చెప్పారు. దీంతో బస్సు సిబ్బంది యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేశారు. అనంతరం బయల్దేరిన కొంత సమయం తర్వాత మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ఈ ఘోరం జరిగిపోయింది. బస్సు డ్రైవర్‌ను అధికారులు విచారిస్తే స్టీరింగ్ స్టక్ అయిందని చెప్పినట్లు తెలిసింది.

# ఎస్ .ఐ.ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం కీలకం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏప్రిల్ మాసంలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు.గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై వివరించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అర్హత ఉన్న ప్రతి పౌరుని పేరు తప్పకుండా నమోదు కావడం, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సిద్ధం కావడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు.ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటు రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను ఈ నెల 30లోగా నియమించి, వారి



జాబితాను నియోజకవర్గ0 వారీగా సమర్పించాలని సూచించారు.బీఎల్ఏల నియామకం పూర్తయిన అనంతరం బూత్ లెవెల్ ఆఫీసర్లు మరియు బీఎల్ఏలకు సంయుక్త సమావేశం నిర్వహించి, ఎస్.ఐ.ఆర్ నిబంధనలు, విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సాఫీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగపు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.
49

# సంగారెడ్డి వరకు మెట్రో రైలు విస్తరణకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్



రాష్ట్ర అసెంబ్లీలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగిస్తామని ముఖ్యమంత్రి గతంలో చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రం వరకు మెట్రో సేవలను విస్తరించాలని ప్రభుత్వాన్ని కోరారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఉండటంతో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఇక్కడ నివసిస్తూ హైదరాబాద్‌కు రోజువారీ రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు విస్తరణ చేపడితే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు.అదేవిధంగా మదీనాగూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జరుగుతున్న రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని అసెంబ్లీలో ప్రస్తావించారు. 2026 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్ట్ ఆలస్యమవుతుండటంతో ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# డంపింగ్ యార్డ్‌తో వాతావరణ కాలుష్యం

– ప్రజల ఆరోగ్యానికి ముప్పు: కొండల్ రెడ్డి



హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన దీక్షలో పాల్గొని ఆయన మాట్లాడారు. 7 నుంచి 8 మున్సిపాలిటీల చెత్తను ఒకేచోట చేర్చి కాల్చడం వల్ల పెద్దఎత్తున పర్యావరణ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు కారణంగా సిర్సపల్లి సహా సమీపంలోని పది గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు ఇతర అనారోగ్యాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.అలాగే, డంపింగ్ యార్డ్ వల్ల వ్యవసాయ భూములు దెబ్బతిని భూసారం తగ్గిపోవడంతో పంటల దిగుబడులు పడిపోతాయని రైతుల ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. పర్యావరణానికి హానికరమైన ఈ ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
50

# మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలి

– మున్సిపల్ కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి



గురువారం జరిగిన ఆందోల్ జోగిపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశములో 12వ వార్డు కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి మాట్లాడుతూ వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వార్డులో మంచినీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ తరుపున అవసరమైన బోర్లు వేసి నీటిఎద్దడి రాకుండా పరిష్కారము చేయాలి అన్నారు.అలాగే మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకోరుల వల్ల అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలి ప్రభుత్వ భూములను గుర్తించి వాటి రక్షణకోసం చుట్టు పెన్సింగ్ వేసి కాపాడే బాధ్యత మున్సిపల్ అధికారులు తీసుకోనీ కాపాడాలి అన్నారుఅలాగే ముఖ్యముగా వార్డుకు వెళ్ళే ప్రధానమార్గం అయిన క్లాక్ టవర్ నుండి 12వ వార్డు వరకు అధ్వాన్నంగా ఉన్న రహదారి పైన సిసి రోడ్డు వేస్తే అక్కడ ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది అని అన్నారు ఈ సందర్భముగా కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి వార్డులోనీ సమస్యలను లిఖితపూర్వకంగా వ్రాసి చైర్మన్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు దీనికి చైర్మెన్ స్పందించి తప్పకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు

# 4 డివిజన్ దుర్షేడ్ లో తప్పుడు సర్వే నంబర్లతో.. ఫేక్ రిజిస్ట్రేషన్లు...?




కరీంనగర్ నగరపాలక సంస్థ నాలుగో డివిజన్ పరిధిలోని దుర్షేడ్ తప్పుడు సర్వే నెంబర్లతో.. తప్పుడు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే గతంలో గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దుర్షేడ్ నేడు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని భూముల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. ఇదే అదనుగా భావించిన కొంతమంది భూ మాఫియాదారులు ఇక్కడి రాజీవ్ రహదారికి దగ్గరలోని సర్వే నంబర్లను తప్పుగా చూపించి, ఇతర ప్రాంత సర్వేనెంబర్ కు చెందిన భూమిని తప్పుడు పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. తప్పుడురిజిస్ట్రేషన్ పత్రాలతో అక్రమంగా ఇంటి నెంబర్లు పొంది, దర్జాగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వాస్తవాలను గ్రహించి తప్పుడు రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# శ్రీరాముని మార్గంలో విద్యార్థులు నడవాలి

– ప్రధానోపాధ్యాయుడు పత్తి నరసింహారెడ్డి...



చెన్నారావుపేట మండలం ప్రాథమిక పాఠశాల పాపయ్యపేట విద్యార్థులకు మన పండుగలు సాంప్రదాయాలు సంస్కృతి గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిపై దృష్టి పెట్టి నమ్మకంతో పట్టుదలతో ఉనప్పుడు మనకు తప్పనిసరిగా విజయం తద్యమని శ్రీరాముడు నిరూపించాడు.సమాజంలో గొప్పవారు కావడానికి ధనం అవసరం లేదని మంచి సత్య గుణాలు కలిగితే గొప్పవారుగా అవుతారని శ్రీరాముడు నిరూపించాడు.ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకొని రామ రాజ్యాన్ని స్థాపించిన శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమారస్వామి స్వరూప విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

# చౌటుకూరు మండల్ కోర్పోల్ గ్రామ శివారులోని ఫామ్హౌస్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్ గారి తమ్ముని జన్మదిన వేడుకలు



కోర్పుల్ గ్రామంలో రామా గౌడ్ భార్గవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి సుమారు 9 నుంచి 10 గంటల లోపల కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు భార్గవ యొక్క వాళ్ళ అన్న జగన్ ఆధ్వర్యంలో జన్మదిన కార్యక్రమం కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపిస్తూ ఇలాగే కోర్పోల్ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి శాలువాతో సన్మానించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల్ బిజెపి మండల అధ్యక్షుడు అమ్మల నవీన్ జగన్ గౌడ్ మండల ఉపాధ్యక్షుడు పెద్ద గొల్ల దత్తాత్రేయ లక్ష్మణ్ అయ్యప్ప రిపోర్టర్ నర్సింలు రాజ్ కుమార్ సోషల్ మీడియా కన్వీనర్ దేవేందర్ లక్ష్మణ్వాళ్ళ ఫ్రెండ్స్ అందరూ కలిసి ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు

# ఉత్తరపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం





సంగారెడ్డి జిల్లా కంది మండల్ ఉత్తర పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏడు, ఎనిమిది వార్డులలో గ్రామ సర్పంచ్ నిఖిత సంగమేశ్ ఆధ్వర్యంలో సి సి రోడ్డు పనులను సర్పంచ్ చే ప్రారంభించడం జరిగింది. ఉత్తర పల్లి గ్రామ సర్పంచ్ నిఖిత సంగమేశ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజి ఆన్ ఆర్ జి ఏ నిధులతో గ్రామములో రూ. 10 లక్షల వ్యయంతో సి సి రోడ్డు మంజూరు అయిందని అన్నారు.ఈ సందర్భంగా 7వ వార్డు సభ్యుడు జాంగిర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామ సర్పంచ్‌కు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఏబీఎన్ రిపోర్టర్ కుటుంబాన్ని పరామర్శించిన మోకుదెబ్బ రమేష్ గౌడ్



నర్సంపేట డివిజన్ ఏబీఎన్ రిపోర్టర్ బూర వేణు గౌడ్ పెద్ద కుమార్తె బూర భువనేశ్వరి గౌడ్ దశదిన ఖర్మ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ భువనేశ్వరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది.వారి ఆత్మకి శాంతి చేకూరాలని,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా సలహాదారులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సొల్తీ సారయ్య గౌడ్, మోకుదెబ్బ జిల్లా సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్,సీనియర్ జర్నలిస్ట్ లు కారుపోతుల విజయ్ కుమార్ గౌడ్,ఉగ్గిడి శివుడు,రాష్ట్ర కార్యదర్శి కోండి రాము గౌడ్, తాళ్ల పెల్లి చంద్ర మౌళి గౌడ్, ఊడ్గుల స్త్రశ్రీనివాస్ గౌడ్,దొంతి సంతోష్ గౌడ్,కళ్లేపల్లి ప్రణయ్ దీప్,మద్దెల శ్రీనివాస్ గౌడ్,మచ్చిక నర్సయ్య గౌడ్, గౌడ్, బూర కుమార్ గౌడ్ గౌడ్,గోడిశాల గిరినాద్ గౌడ్, వేముల గోపి గౌడ్,సాంబరాతి మల్లేశం, పులి రాజేందర్,బూర సుధాకర్ గౌడ్, బూర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాదర్ పేట మూలమలుపు ప్రమాద స్థలం హెచ్చరిక బోర్డు ఏర్పాటు




చెన్నారావుపేట మండల పరిధి ఖాదర్ పేట శివారులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో రెడ్ జోన్ గా గుర్తించిన పోలీసులు వాహనాలు వేగవంతంగా నడప వద్దు అని నెక్కొండ సిఐ శ్రీనివాస్ చెన్నరావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి అన్నారు.ప్రమాదకరమైన స్థలంగా గుర్తించి. ముందు ముందు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది,8వ వార్డు మెంబర్ అరిగెల రాజేష్,మాజీ ఉప సర్పంచ్ ముస్కు రాజు, గ్రామస్తులు సింగిరెడ్డి రవి,రాకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈకాలం
THE HONEST TELUGU DAILY
27-03-2026

# ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల





ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లతో కూడిన తొలి దశ షెడ్యూల్‌ను మాత్రమే ప్రకటించిన బీసీసీఐ.. గురువారం మిగిలిన 50 మ్యాచ్‌ల వివరాలను వెల్లడించింది. మార్చి 28 నుంచి మే 24 వరకు లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. మే 31న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఈ సీజన్‌కు తెరపడనుంది. అయితే ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు.సెకండాఫ్ షెడ్యూల్‌లో 12 వేదికల్లో మొత్తం 50 మ్యాచ్‌లు జరగనుండగా.. ఇందులో 8 డబుల్ హెడర్స్ ఉన్నాయి. డబుల్ హెడర్స్ ఉన్న రోజున మధ్యాహ్నం 3:30 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి 7:30 గంటలకు రెండో మ్యాచ్ మొదలవుతుంది.సెకండాఫ్ షెడ్యూల్‌లో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది. మొత్తంగా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, న్యూ చండీగఢ్, రాయ్‌పూర్ వేదికల్లో ఐపీఎల్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. సెకండాఫ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మొత్తం 10 మ్యాచ్‌లు ఆడనుంది. ఉప్పల్ వేదికగా మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనున్నాయి. డేవిడ్ వార్నర్ సారథ్యంలో ఐపీఎల్ 2016 టైటిల్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. 2018, 2024లో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. ఈ సీజన్‌లోనైనా టైటిల్ గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీతో సన్‌రైజర్స్

# సీజన్ మధ్యలో బరిలోకి దిగుతా

## కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెల్లడి




ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గుడ్ న్యూస్ చెప్పాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న తాను వేగంగా కోలుకుంటున్నానని, సీజన్ మధ్యలో బరిలోకి దిగుతానని తెలిపాడు. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్ సందర్భంగా వెన్ను గాయానికి గురైన ప్యాట్ కమిన్స్.. అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ గాయం కారణంగానే అతను ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కూడా ఆడలేదు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు కూడా ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ బాధ్యతలను ఇషాన్ కిషన్‌కు అప్పగించారు. గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరమైనా.. ప్యాట్ కమిన్స్ బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసాడు. గాయంతో ఇబ్బంది పడుతున్నా జట్టుతో కలిసి అతను ప్రయాణించనున్నాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కమిన్స్ పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు.తాజాగా టీమ్ సోషల్ మీడియా టీమ్‌తో మాట్లాడిన కమిన్స్.. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టుకు అందుబాటులోకి వస్తానని చెప్పాడు. 'నేను వెన్ను గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నా. ప్రస్తుతం నేను బాగానే ఉన్నా. చిన్నగా నెట్స్‌లో బౌలింగ్ కూడా చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ఆరంభ మ్యాచ్‌లు ఆడలేకపోతున్నా.టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అంతా అనుకున్నట్లు జరిగితే నేను టోర్నీ రెండో భాగం, ఫైనల్స్‌లో మైదానంలోకి దిగుతాను' అని కమిన్స్ తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా తొలి మ్యాచ్ చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం(మార్చి 28న) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే.

# చరిత్ర సృష్టించనున్న భువనేశ్వర్ కుమార్




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుస్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. సరికొత్త చరిత్రను లిఖించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా తన పాత జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు తీస్తే వరల్డ్ రికార్డ్ నమోదు చేయనున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లోనే 200 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా చరిత్రకెక్కనున్నాడు. ఇప్పటివరకు 190 మ్యాచులు ఆడిన ఈ ఆర్‌సీబీ స్వింగ్ కింగ్ 27.33 సగటుతో 198 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు ఐదు వికెట్ల ప్రదర్శనలు, రెండు నాలుగు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మాత్రమే అతని కంటే ముందున్నాడు. అత్యధిక ఐపీఎల్ వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ తర్వాత ముంబై ఇండియన్స్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఉన్నాడు. అతను 145 మ్యాచుల్లో 22.02 సగటుతో 183 వికెట్లు తీశాడు. చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ప్లేయర్ డ్వేన్ బ్రావో 161 మ్యాచుల్లో 183 వికెట్లతో బుమ్రా సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో బుమ్రా 200 వికెట్ల మైలురాయి అందుకునే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో భువనేశ్వర్ కుమార్‌ను ఆర్‌సీబీ రూ.10.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వేలంలో లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ జట్లతో పోటీపడి మరి కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో 14 ఇన్నింగ్స్‌ల్లో 17 వికెట్లతో ఆర్‌సీబీ విజయంలో భువీ కీలక పాత్ర పోషించాడు. ఆర్‌సీబీ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు.36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌కు కొత్త బంతితో అద్భుతమైన రికార్డు ఉంది. పవర్‌ప్లే ఓవర్లలో అతను అత్యధికంగా 79 ఐపీఎల్ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో ముంబై ఇండియన్స్ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ మాత్రమే ఈ భారత వెటరన్‌కు దగ్గరగా ఉన్నాడు. పవర్‌ప్లేలో తీసిన మొత్తం 79 వికెట్లలో 29 వికెట్లను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పడగొట్టడం అతని ప్రత్యేకత. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ 43 పరుగులిచ్చి ఒకే వికెట్ తీసాడు. ట్రావిస్ హెడ్ మాత్రమే ఔట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 94 పరుగులతో అజేయంగా నిలిచాడు.

Eekalam News, printed and published by Devender Nukala,
d at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal